www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 29 జూన్ 2024

11.8 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు

ప్రజాశక్తి - నరసాపురం

జిల్లాలోని పలు మండలాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల వరకూ గడిచిన 24 గంటల్లో వర్షం కురిసింది. అత్యధికంగా పాలకొల్లులో 28.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా మొగల్తూరు, కాళ్లలో 6.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గణపవరం 24.2, నరసాపురం 23.2, అత్తిలి 14.4, ఇరగవరం 13, పెనుగొండ 12, తాడేపల్లిగూడెం 11.4, పెనుమంట్ర 11.2, ఆచంట 10, పోడూరు 9.6, ఆకివీడు, తణుకు, పెంటపాడుల్లో 9.2 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. జిల్లాలో మొత్తం 20 మండలాలకుగాను 235.8 మిల్లీమీటర్ల వర్షం కురిసిందని, సగటు వర్షపాతం 11.8 మిల్లీమీటర్లు నమోదైందని అధికారులు తెలిపారు.

ప్రత్యేక 'సహకారం'..!

సహకార సంఘాలకు ప్రత్యేక అధికారుల నియామకం

రెండు జిల్లాల్లో 281 సంఘాలు ప్రత్యేక పాలనలోకి

ఒక్కో అధికారి పర్యవేక్షణలో 4 నుంచి 5 సంఘాలు

రాజీనామాలు చేయని 44 సంఘాల కమిటీలు రద్దు..

ప్రత్యేక అధికారులకు బాధ్యతలు

సహకార సంఘాల ఎన్నికలు ఇప్పట్లో లేనట్టే?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సహకార సంఘాలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అధికారుల నియామక బాధ్యతలను జిల్లా సహకార సంఘాల అధికారికి అప్పగించింది. దీంతో శుక్రవారం సాయంత్రానికి ప్రత్యేక అధికారుల నియామకం పూర్తయినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. 2013 జనవరిలో కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో సహకార సంఘాల ఎన్నికలు జరిగాయి. 2018 జనవరిలో వాటి కాలపరిమితి ముగిసింది. అప్పటి టిడిపి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా 2019 జులై వరకూ పాలకవర్గాల పదవీకాలం పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 2019 ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికల్లో టిడిపి ఓటమిపాలైంది. దీంతో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తుందని అంతా భావించారు. అయితే ఎన్నికలు నిర్వహించకుండా సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలను నియమించింది. ఒక ఛైర్మన్, ఇద్దరు కమిటీ సభ్యులుగా త్రిసభ్య కమిటీని నియమించి సహకార సంఘ బాధ్యతలు అప్పగించింది. ఆరు నెలలకోసారి పదవీకాలం పొడిగిస్తూ ఐదేళ్లు కాలయాపన చేసింది. ఇప్పటి వరకూ త్రిసభ్య కమిటీల ఆధ్వర్యంలోనే సహకార సంఘాలు పని చేస్తూ వచ్చాయి. విభజిత ఏలూరు జిల్లాలో మొత్తం 159 సహకార సంఘాలు ఉండగా, పశ్చిమగోదావరి జిల్లాలో 122 ఉన్నాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో టిడిపి గెలుపొందింది. దీంతో వైసిపి ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ సభ్యులు స్వచ్ఛందంగానే రాజీనామాలు చేశారు. కొన్ని సంఘాలకు చెందిన కమిటీలు రాజీనామా చేయలేదు. రెండు జిల్లాల్లో మొత్తం 281 సంఘాలు ఉండగా 44 సంఘాలకు చెందిన కమిటీలు రాజీనామా చేయలేదు. ఇవి ఏలూరు జిల్లాలో 28, పశ్చిమలో 16 సంఘాలు ఉన్నాయి. రాజీనామా చేయని కమిటీలను రద్దు చేయడంతోపాటు అన్ని సంఘాలకు ప్రత్యేక అధికారులను నియమించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏలూరు జిల్లాలో గతం నుంచి ఏడు సంఘాలు ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్నాయి. దీంతో మిగిలిన 152 సంఘాలకు ప్రత్యేక అధికారుల నియామకం జరిగింది. పశ్చిమగోదావరి జిల్లాలోని 122 సంఘాలకు అధికారుల నియామకం పూర్తయింది. సహకార సంఘాల అధికారుల్లోని రిజిస్ట్రార్ స్థాయి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించారు. ప్రతి ప్రత్యేక అధికారికి నాలుగు నుంచి ఐదు సంఘాల వరకూ బాధ్యతలు అప్పగించారు. ప్రత్యేక అధికారులు 2024 డిసెంబర్ 20 వరకూ ఆరు నెలలపాటు బాధ్యతలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. తర్వాత ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెబుతున్నారు.

దాదాపు 20 రోజులుగా సహకార సంఘాల్లో నిలిచిన లావాదేవీలు

జులై నాలుగో తేదీన ఎన్నికల ఫలితాలు వచ్చాయి. ఆ తర్వాత సంఘాల త్రిసభ్య కమిటీలు రాజీనామా చేశాయి. జులై ఏడో తేదీకి ఏలూరు జిల్లాలో 28, పశ్చిమలో 16 సంఘాలకు మినహా మిగిలిన అన్ని సంఘాల కమిటీలు రాజీనామా చేసేశాయి. అప్పటి నుంచి ప్రభుత్వం ఎటువంటి ఆదేశాలూ రాలేదు. దీంతో సంఘం అధ్యక్షుడు, త్రిసభ్య కమిటీ ఛైర్మన్ లేకపోవడంతో రైతులకు రుణాలిచ్చే ప్రక్రియతోపాటు పలు పనులు సహకార సంఘాల్లో నిలిచిపోయాయి. సహకార సంఘాల పాలన స్తంభించడంతో రైతుల్లో తీవ్ర అలజడి నెలకొంది. ఖరీఫ్ సాగు ఆరంభం కావడంతో రుణాలు అందకపోవడం వంటి ప్రక్రియ రైతులను ఇబ్బందులకు గురిచేసింది. దీనిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

'సహకారం'లో ఎన్నికలు జరిగేదెప్పుడో..?

ప్రజాస్వామ్యంలో ఎన్నికలు అత్యంత కీలకం. అన్ని వ్యవస్థలకూ సకాలంలో ఎన్నికలు నిర్వహిస్తేనే పాలన సజావుగా సాగుతోంది. ప్రభుత్వాలు మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. సహకార సంఘాలకు ఎన్నికలు జరిగి 11 ఏళ్లు పూర్తయిపోయింది. ఇప్పటి వరకూ మళ్లీ ఎన్నికల నిర్వహణ అనేది లేకుండాపోయింది. ప్రత్యేక అధికారులు, నామినేటెడ్ సభ్యులతో కాలక్షేపం చేస్తూ ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచారనే విమర్శలు విన్పించాయి. గ్రామాల్లో సహకార సంఘాలు రైతులకు ఎనలేని సేవలు అందిస్తున్నాయి. ఎన్నికలు జరిగితే ప్రతి సంఘానికి అధ్యక్షునితోపాటు మరో 11మంది సభ్యులు ఎన్నికవుతారు. వీరంతా రైతులకు దగ్గరగా ఉండటంతో పాలన సజావుగా సాగుతోంది. అలాంటి వ్యవస్థను పక్కదారి పట్టించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

భీమవరం కలెక్టర్‌గా నాగరాణి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా కలెక్టర్‌గా సి.నాగరాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మధ్యాహ్నం 1.30 గంటలకు కలెక్టరేటుకు చేరుకున్న ఆమెకు జిల్లా జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్‌ఆదిత్య, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు ఘన స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ తన ఛాంబర్లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, అన్ని రంగాల్లో అభివృద్ధి పథాన నడిపిస్తానని తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామన్నారు. గతంలో తాను వివిధ హోదాల్లో పని చేశానని, అన్ని శాఖలపై అవగాహన ఉందని చెప్పారు. జిల్లా అభివృద్ధికి అధికారులంతా తమ వంతు కృషి చేయాలని కలెక్టర్ సి.నాగరాణి కోరారు. బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్‌కు కలెక్టరేట్ పరిపాలనాధికారి పి.పాపారావు, భీమవరం, నరసాపురం ఆర్‌డిఒలు కె.శ్రీనివాసులురాజు, ఎం.అచ్యుత అంబరీష్, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సెక్షన్ల సూపరింటెండెంట్లు, ఉద్యోగులు పుష్పగుచ్ఛాలను అందజేశారు.

కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న జెసి ప్రవీణ్ ఆదిత్య

రోడ్లు, తాగునీటి సమస్య పరిష్కరించాలని సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - ఆకివీడు

స్థానిక సమతానగర్‌లో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని, అక్కడ ప్రజలకు కనీసం తాగునీరు అందడం లేదని సిపిఎం పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు అన్నారు. వానొస్తే రోడ్లన్నీ మోకాలు లోతు నీటితో నిండిపోతున్నాయన్నారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో అక్కడి ప్రజలు శుక్రవారం ఆ రహదారి మార్గంలో నిరసన చేపట్టారు. మోకాలు లోతు నీళ్లలో రోడ్డుపై అడ్డంగా నిలబడి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తవిటినాయుడు మాట్లాడుతూ రోడ్లు, తాగునీటి పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. 30 సంవత్సరాలుగా సమతానగర్లో రోడ్లు వేయలేదని, అక్కడి ప్రజలకు తాగునీరు అందడం లేదని తెలిపారు. ప్రజలు ఎప్పటికప్పుడు పంచాయతీ ఆఫీసుకు వెళ్లి వినతిపత్రాలను ఇచ్చిన అధికారులుగాని, ప్రజాప్రతినిధులుగాని పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికీ సమతానగర్ శివారు ప్రాంతాలకు తాగునీరు అందడం లేదన్నారు. తక్షణమే రోడ్లు, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బొడ్డుపల్లి రాంబాబు, వాసంశెట్టి సత్యవతి, రాములమ్మ, ఆవుల పెద్దులు పాల్గొన్నారు.

సమతానగర్ రోడ్డులో మోకాళ్లలోతు నీటిలో ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

మృత్యుతీగలు..!

విద్యుదాఘాతంతో పలువురు మృత్యువాత

ప్రజాశక్తి - నరసాపురం

అవగాహనా లోపం.. అజాగ్రత్త.. నిర్లక్ష్యం.. వెరసి నిండు ప్రాణాలు బలవుతున్నాయి. కరెంటు కాటుకు కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో వరుసగా చోటుచేసుకుంటున్న విద్యుత్ ప్రమాద మరణాలు అందరినీ ఆవేదనకు, ఆందోళనకు గురిచేస్తున్నాయి.

వర్షాకాలం వచ్చింది. వర్షాలు కురుస్తున్నాయి. అదే సమయంలో గాలుల తీవ్రత కూడా పెరిగింది. ఈ క్రమంలో విద్యుత్ ఉపకరణాల వినియోగంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులు హెచ్చరిస్తున్నారు. అలాగే విద్యుత్ స్తంభాలు, తీగలకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. బుధ, గురు, శుక్రవారాల్లో విద్యుత్ ప్రమాదాల్లో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఆరుగురు మృత్యువాత పడటం గమనార్హం. బుధవారం నరసాపురం మండలంలోని కొప్పర్రులో విద్యుదాఘాతానికి ఓ చిరుద్యోగి ప్రాణాలు కోల్పోయాడు. గురువారం ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం ఈదరలో బట్టలు ఆరేస్తుండగా తల్లీ కొడుకు, పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పట్టణంలో మోటారు స్విచ్ఛాన్ చేస్తుండగా భార్యాభర్తలు విద్యుదాఘాతానికి గురై మృతి చెందడం అందరినీ కలిచివేసింది. శుక్రవారం పెనుగొండ మండలం వడలిలో పొలానికి వెళ్లిన ఓ కౌలు రైతు తెగిన విద్యుత్ తీగపై చూసుకోకుండా కాలువేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యానికి తోడు జనం అప్రమత్తంగా లేకపోవడం కూడా ప్రమాదాలకు కారణమని స్పష్టమవుతోంది.

2022-23లో 60 ప్రమాదాలు జరగ్గా 45 మంది,

ఆగిరిపల్లి మండలం ఈదరలో విద్యుదాఘాతంతో మృతి చెందిన తల్లీ కొడుకు (ఫైల్‌ఫొటో)

2023-24లో 58 ఘటనల్లో 49 మంది ప్రాణాలు కోల్పోయారు. 2024-25లో ఇప్పటికే 49 విద్యుత్ ప్రమాదాలు జరగ్గా 25 మంది ప్రాణాలొదిలారు. ఇలా చాలాచోట్ల కరెంట్ షాక్‌తో జనం మృత్యువాత పడుతున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

1.వర్షాలు కురిసేటప్పుడు స్టే వైర్, విద్యుత్ లైన్ల కింద, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద నిల్చోరాదు. వీలైనంత వరకు విద్యుత్ వైర్లకు, స్టే వైర్లకు, ట్రాన్స్‌ఫార్మర్లకు, ఇతర విద్యుత్ పరికరాలకు దూరంగా ఉండాలి. పశువులను, పెంపుడు జంతువులను కూడా విద్యుత్ పరికరాల నుంచి దూరంగా ఉంచాలి.

2.ఎక్కడైనా రోడ్డు మీద, నీటిలోగాని విద్యుత్ తీగ పడి ఉంటే ఆ తీగను తొక్కడం గాని, వాటి మీద నుంచి వాహనాలు నడపడంగాని చేయరాదు. ఒకవేళ ఎక్కడైనా తీగ తెగిపడ్డట్టు ఉంటే వెంటనే సమీప విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి.

3.విద్యుత్ స్తంభాలను, స్టే వైర్లను తాకరాదు. ఒకవేళ ఎవరైనా తాకి విద్యుత్ షాక్ బారిన పడితే వారిని రక్షించడానికి విద్యుత్ ప్రవాహకాలైన లోహపు రాడ్లను ఉపయోగించకుండా చెక్క లేదా ప్లాస్టిక్‌తో చేసిన పైపులను మాత్రమే వాడాలి.

4.చెట్ల కొమ్మలపై, వాహనాలపై, ఇతర భవనాలపై తెగిపడ్డ తీగలు ఉన్నట్లయితే వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలి.

5.భారీ గాలులు, వర్షం పడేటప్పుడు విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గులు ఉంటే విద్యుత్ పరికరాలను ఆఫ్ చేసి వెంటనే కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలి.

6.విద్యుత్ అంతరాయం ఫిర్యాదుల నమోదు కోసం కంట్రోల్ రూమ్‌ను సంప్రదించే వినియోగదారులు తమ బిల్లుపై ముద్రితమైన టోల్ ఫ్రీ నెంబర్‌ను సిద్ధంగా ఉంచుకోవాలి.

7.లోతట్టు ప్రాంతాలు, ముంపునకు అవకాశమున్న ప్రాంతాల్లో నివసించే వినియోగదారులు నీటి ప్రవాహం అధికంగా ఉన్నప్పుడు వెంటనే విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలి.

8.ట్రాన్సఫార్మర్ వద్ద శబ్దం వస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలి.

9.తడి చేతులతో స్విచ్ఛ్‌లను, ప్లగ్‌లను తాకరాదు. కచ్చితంగా చెప్పులు ధరించి విద్యుత్ పరికరాలను తాకాలి.

స్వీయ అప్రమత్తతే కీలకం..

బళ్ల సురేష్‌కుమార్, విద్యుత్ శాఖ డిఇ

వర్షాలు కురిసే టప్పుడే కాదు.. సాధారణ సమయాల్లోనూ విద్యుత్ ఉపకరణాలు వాడేటప్పుడు స్వీయ అప్రమత్తత చాలా కీలకం. బహిరంగ ప్రదేశాల్లోనూ విద్యుత్ స్తంభాలు, తీగలకు దూరంగా ఉండాలి. అప్పుడే విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా ఉంటాం. విద్యుత్ విషయంలో కచ్చితంగా స్వీయ నియంత్రణ తప్పనిసరి.

విద్యుత్ తీగ తెగిపడి కౌలురైతు మృతి

ప్రజాశక్తి - పెనుగొండ

విద్యుత్ తీగ తెగి పడి కౌలు రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని వడలి గ్రామంలో చోటుచేసుకుంది. వడలికి చెందిన తానేటి గంగయ్య (58) ఎకరం పొలం కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ఆ పొలంలో దమ్ము చేయించేందుకు వెళ్తున్నానని గురువారం సాయంత్రం ఇంటి వద్ద నుంచి వెళ్లాడు. గంగయ్య ఒక్కోసారి రాత్రి వేళల్లో ఇంటికి రాకుండా పశువుల పాక వద్ద నిద్రిస్తుంటాడు. అందువల్ల కుటుంబ సభ్యులకు అనుమానం రాలేదు. శుక్రవారం ఉదయం కూడా రాకపోవడంతో అనుమానమొచ్చి పొలానికి వెళ్లి చూడగా సాగు చేసే పొలంలోనే విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు గుర్తించారు. పెనుగొండ ఎస్ఐ షేక్ సుభాని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

ఈ ప్రమాదంలో విద్యుత్ శాఖ ఎఇ పి.రాంబాబు మాట్లాడుతూ డమ్మీ వైరు తెగి ఎల్‌టిలైన్‌కు తగలడంతో విద్యుత్ ప్రవహించి గంగయ్య మృతి చెందినట్లు భావిస్తున్నామని తెలిపారు.

మృతుడు తానేటి గంగయ్య (ఫైల్‌ఫొటో)

కౌలు రైతు కుటుంబానికి న్యాయం చేయాలి

విద్యుత్ శాఖ వైఫల్యం వల్ల మృతి చెందిన కౌలురైతు గంగయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ వడలి గ్రామ కార్యదర్శి వేడంగి సర్వేశ్వరరావు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపయోగంలో లేని విద్యుత్ వైర్లు తొలగించకుండా వదిలేయడమే ప్రమాదానికి కారణమని పేర్కొన్నారు. ప్రభుత్వం కౌలు రైతు కుటుంబానికి రూ.15 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం నాయకులు తొంటా సత్యనారాయణ, రుద్ర రామాంజనేయులు, ఆవుల శ్రీనివాసరావు, కోమటి సత్యనారాయణ డిమాండ్ చేశారు.

దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం - వెంపలో బాధిత దళితులకు సిపిఎం బృంద పరామర్శ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

వెంప గ్రామంలో దళితులపై సామూహిక దాడికి పాల్పడిన వారిని తక్షణం అరెస్టు చేయాలని, దిశ, నిర్భయ చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. ఈ నెల 23న వెంప గ్రామంలో దాడికి గురైన బాధిత దళితులను సిపిఎం బృందం పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీన అర్ధరాత్రి సమయంలో దళితులపై కర్రలు, రాడ్లతో సామూహిక దాడికి పాల్పడటం దారుణమన్నారు. దళితపేటపై దాడి చేసి నిద్రిస్తున్న దళిత కుటుంబాన్ని బయటికి రాకపోతే ఇంటికి నిప్పంటిస్తామని భయభ్రాంతులకు గురిచేసారని బాధితులు వాపోయారన్నారు. మహిళ అని కూడా చూడకుండా విచక్షణారహితంగా బట్టలను సైతం చించడం, కుటుంబ సభ్యులపై దాడి చేసి, వారి ద్విచక్ర వాహనాలను ధ్వంసం చేయడం దారుణమన్నారు. ఇంత జరిగినా పోలీసులు కఠినంగా వ్యవహరించకపోవడం అన్యాయమన్నారు. అర్ధరాత్రి దాడి చేసిన వారిని అక్కడికక్కడే పోలీసులు పట్టుకుని ఎందుకు అదుపులోకి తీసుకోలేదని ప్రశ్నించారు. మహిళపై అసభ్యకరంగా, అమానుషంగా ప్రవర్తించినా దిశ, నిర్భయ చట్టప్రకారం కేసులు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. దర్యాప్తు పేరుతో కాలయాపన చేయడం తగదన్నారు. తక్షణం దోషులను అరెస్టు చేసి, బాధితులకు న్యాయం చేయాలని బలరాం డిమాండ్ చేశారు. గ్రామంలో ఉన్నతాధికారులు పర్యటించి, దాడులు పునరావృతం కాకుండా బాధితులకు రక్షణ కల్పించాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టప్రకారం బాధితులకు ఇవ్వాల్సిన నష్ట పరిహారం తక్షణం అందించాలని డిమాండ్ చేశారు. నిందితులను తక్షణం అరెస్టు చేయాలని, లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు.

బాధితులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం, జెఎన్‌వి గోపాలన్

వెంపలో ఆర్‌డిఒ పర్యటించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ దళితులపై దాడికి పాల్పడటం అన్యాయమన్నారు. దాడి జరిగి ఐదు రోజులైనా కేసులో ఎటువంటి పురోగతీ లేకపోవడం దారుణమన్నారు. అణగారిన వర్గాలపై దాడి జరిగితే దానిని రాజకీయం చేయడం మాని దళితులకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. తక్షణం ఆర్‌డిఒ వెంప గ్రామాన్ని సందర్శించి బాధితులతో నేరుగా మాట్లాడాలని కోరారు. బాధితులే అధికారుల వద్దకు తిరగడం తప్ప అధికారులు మాత్రం వెంప గ్రామాన్ని సందర్శించకపోవడం అన్యాయమన్నారు. తక్షణం జిల్లా, డివిజనల్ అధికారులు స్పందించి వెంప గ్రామాన్ని సందర్శించి బాధిత దళితులను పరామర్శించి వారికి అండగా ఉండాలని గోపాలన్ కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బత్తుల విజయ్‌కుమార్, కె.క్రాంతిబాబు, సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్, బాధిత దళితులు పాల్గొన్నారు.

వరినాట్లు త్వరితగతిన పూర్తి చేయాలి

జాయింట్ కలెక్టర్ ప్రవీణ్‌ఆదిత్య

ప్రజాశక్తి - భీమవరం టౌన్

జిల్లాలో సార్వా వరినాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని, నవంబరు నెలలో తుఫాన్లు బారిన పడకుండా జాగ్రత్త వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్ ఆదిత్య రైతులను కోరారు. శుక్రవారం స్థానిక వశిష్ట కాన్ఫరెన్స్ హాల్‌లో ఖరీఫ్ సాగు సన్నద్ధతపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ప్రవీణ్‌ఆదిత్య మాట్లాడుతూ నవంబర్, డిసెంబర్‌ల్లో తుఫాన్లు ఏర్పడే అవకాశం ఉందని, ఆ సమయంలో పంట నష్టపోకుండా త్వరితగతిన నాట్లు పూర్తిచేసి, సకాలంలో పంట కోతలను పూర్తి చేయాలన్నారు. వ్యవసాయాధికారులు ఈ విషయమై రైతులకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. అత్యధికంగా తాడేపల్లిగూడెం మండలంలో 10,224 హెక్టార్లు, అత్యల్పంగా మొగల్తూరు మండలంలో 333 హెక్టార్లలో వరి సాగు జరుగుతుందన్నారు. జిల్లాకు 48,463 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరమవ్వగా 85 క్వింటాళ్ల విత్తనాలను కేజీ రూ.ఐదు చొప్పున సబ్సిడీపై అందజేశామన్నారు. సీడ్ విలేజ్ కార్యక్రమం ద్వారా 50 శాతం సబ్సిడీపై 195.5 క్వింటాళ్ల విత్తనాలను అందజేసినట్లు తెలిపారు. 43,585 క్వింటాళ్ల విత్తనాలను రైతులు స్వయంగా సమకూర్చుకున్నారని, 4,598 క్వింటాళ్ల విత్తనాలను ప్రైవేటు డీలర్స్ ద్వారా సరఫరా జరిగినట్లు తెలిపారు. ఎంటియు-1318, 7029, 1061, 1064, స్పందన స్వర్ణ, పిఆర్ 126 వెరైటీ విత్తనాలను జిల్లాలో ఎక్కువగా వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో రూ.4,179 కోట్లు పంట రుణాలు, రూ.3,116 కోట్లు టర్మ్ లోన్స్ అందజేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. సాగునీటికి ఇబ్బంది లేని విధంగా అవసరమైన డ్రెయిన్లు పూడికతీత, కిక్కిస తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు ప్రవీణ్ ఆదిత్య సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డ్రెయినేజీ ఇఇ ఎంవివి.కిషోర్, కెనాల్స్ ఇఇ ఎం.దక్షిణామూర్తి, వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

కొత్త క్రిమినల్ చట్టాల అమలు ఆపాలి

ప్రజాశక్తి - తణుకు

పౌర హక్కులకు భంగం కలిగించే కొత్త క్రిమినల్ చట్టాల అమలును నిలుపుదల చేయాలని న్యాయవాదులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక బార్‌అసోసియేషన్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్, ఆలిండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జులై ఒకటో తేదీ నుండి కొత్త క్రిమినల్ చట్టాల అమలు నిలుపుదల చేయాలని కోరుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవ్యవస్థకు ఉన్న అధికారాలను తగ్గించి, పోలీసు అధికారులకు, ఎగ్జిక్యూటివ్ అధికారులకు జ్యుడీషియల్ అధికారాలను కొత్త చట్టాలు కల్పించిందన్నారు. ప్రజలు వారి సమస్యలపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నాలు, నిరసనలు, ప్రదర్శనలు చేస్తే పోలీసులు వారిపై క్రిమినల్ కేసులు పెట్టి బేడీలతో తీసుకెళ్లే అధికారాన్ని కొత్త చట్టం కల్పిస్తుందన్నారు. వీటిని వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో న్యాయవాదులు ఎ.బాలరాజు, కౌరు వెంకటేశ్వర్లు, అశోక్‌కుమార్, బండి వెంకటేశ్వర్లు, దుర్గాప్రశాంతి, కామన మునిస్వామి, చింతపల్లి నాగేశ్వరరావు, నీలం హరీష్‌నాయుడు, జి.అంబేద్కర్, ఎన్.సోమేశ్వరరావు, ఎస్‌కె.బాజీ, పి.ప్రతాప్‌కుమార్, ఎన్.శ్యాంసన్ పాల్గొన్నారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

అవును.. నేను అన్‌ఫిట్..!

డిప్యూటీ ఆర్‌ఐఒ నాగేశ్వరరావు

ఎస్ఆర్ కళాశాల వద్ద ఎస్‌ఎఫ్ఐ ఆందోళన

ప్రజాశక్తి - భీమవరం టౌన్

'అవును.. నేను అన్‌ఫిట్.. నేను ఎటువంటి చర్యలూ తీసుకోలేను. నాకు ఎటువంటి అధికారాలూ లేవు. కేవలం నా పని ప్రభుత్వ కళాశాలల్లో ఏమైనా అక్రమాలు జరిగితే చర్యలు తీసుకోవడమే. ప్రయివేట్ కళాశాలల్లో ఏం జరిగినా నేను ఎటువంటి చర్యలూ తీసుకోలేను. అంతా ఆర్‌ఐఒనే చూసుకుంటారు' అని డిప్యూటీ ఆర్‌ఐఒ నాగేశ్వరరావు చెప్పడం అందరినీ విస్మయపర్చింది. స్థానిక బైపాస్ రోడ్‌లోని ఎస్ఆర్ కళాశాలలో నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు అమ్ముతున్నారని, వాటిని సీజ్ చేయాలని ఎస్‌ఎఫ్ఐ నేతలు ఆర్‌ఐఒకు సమాచారం ఇచ్చారు. ఆర్‌ఐఒ అందుబాటులో లేకపోవడంతో డిప్యూటీ ఇంటర్మీడియట్ అధికారి నాగేశ్వరరావును పంపించారు. నాగేశ్వరరావు ఎస్‌ఎఫ్ఐ నేతలను పట్టించుకోకుండా కళాశాల యాజమాన్యంతో మాట్లాడి వెళ్లిపోవాలని ఎస్‌ఎఫ్ఐ నేతలకు సూచించారు. దీనిపై అక్కడున్న మీడియా ప్రతినిధులు మీరేమీ చర్యలు తీసుకోరా అంటే పై విధంగా స్పందించారు. అనంతరం అక్కడ నుంచి వెళ్లిపోయారు. దీనిపై ఎస్‌ఎఫ్ఐ నేతలు గేటు వద్ద కొద్దిసేపు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్ మాట్లాడారు.

దాతల సహకారం అభినందనీయం

ప్రజాశక్తి - కాళ్ల

దాతల సహకారంతో విద్యా సామగ్రి పంపిణీ చేయడం అభినందనీయమని ఎంఇఒ ఎ.రవీంద్ర అన్నారు. పెద అమిరం గ్రామంలో స్పెషల్ ప్రాథమిక పాఠశాలలో దాతల సహకారంతో సర్పంచి డొక్కు సోమేశ్వరరావు ఆధ్వర్యంలో 60 మంది విద్యార్థులకు విద్యా సామగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. సర్పంచి డొక్కు సోమేశ్వరరావు, మాజీ ఉప సర్పంచి కోరా రామ్మూర్తి నాయుడు, సరాబు ముకేష్ సుమారు రూ.20 వేల విలువైన నోట్ బుక్స్, పలకలు, ప్లాస్క్ పంపిణీ చేశారు. అలుగు సెబాస్టియన్ దాత రూ.65 వేల ఆర్థిక సహకారంతో ట్రైబ్స్ ఏర్పాటు చేశారు. పిల్లలకు మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు రూ.10 వేల విలువైన స్టీల్ గ్యాస్‌స్టవ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జవ్వాది లీలా కిషోర్, వార్డు సభ్యులు అలుగు క్రిస్టఫర్, బిరుదుగడ్డ జాషువ, అలుగు సెబాస్టియన్, ఆరేపల్లి పరమేశ్వర్, కేతా శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు బి.వి.రామరాజు, ఉపాధ్యాయుడు గుదే సుబ్బారావు, ఉపాధ్యాయిని జి.సునీత పాల్గొన్నారు.

వీరవాసరం : అందరికీ నాణ్యమైన విద్య అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం బలోపేతం చేస్తోందని ఎంపిటిసి రమాదేవి శ్రీనివాస్ అన్నారు. మత్స్యపురి మండల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయిని ఎంవిడి భవాని ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన దాత కమలాపురం శ్రీమ్ ఆర్థిక సహకారంతో చింతా నారాయణమూర్తి సహకారంతో రూ.ఐదు వేల ఖరీదు చేసే విద్యాసామగ్రిని విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి జవ్వాది భాస్కరరావు, ఉపాధ్యాయులు మణికుమార్, ఎ.శ్రీరాములు, ఎస్.సావిత్రి, జి.కాశీఅన్నపూర్ణ, స్కూల్ చైర్మన్ కల్యాణదేవి పాల్గొన్నారు.

ఉండి : గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి దాతల సహకారం అవసరమని టిడిపి ఎంపిటిసి కుసుమ రమాదేవి శ్రీనివాస్ అన్నారు. ఉండి కొత్తపేట మండల పరిషత్ పాఠశాలలో రమాదేవి శ్రీనివాస్ ఆర్థిక సహకారంతో విద్యార్థులకు శుక్రవారం విద్యాసామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిటిసి రమాదేవి శ్రీనివాస్ మాట్లాడుతూ ఏటా తమ కుటుంబ సభ్యులు పేరిట విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బాబు, రవి, బైరెడ్డి పైడియ్య పాల్గొన్నారు.

సమస్యలను సత్వరం పరిష్కరించండి

అధికారులకు ఎంఎల్ఎ అంజిబాబు ఆదేశం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రజలకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా మున్సిపాల్టీలో సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఎంఎల్ఎ రామాంజనేయులు (అంజిబాబు) అధికారులను ఆదేశించారు. శుక్రవారం భీమవరం పురపాలక సంఘం అధికారులతో ఎంఎల్ఎ రామాంజనేయులు, జనసేన జిల్లా అధ్యక్షులు కోటికలపూడి గోవిందరావు సమీక్షించారు. ఈ సమావేశంలో పట్టణాభివృద్ధికి సంబంధించిన అంశాలు, తాగునీరు, టిడ్కో ఇళ్ల కేటాయింపు తదితర సమస్యలపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. పట్టణానికి సంబంధించి శానిటేషన్ క్రమబద్ధీకరించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డ్రెయినేజీల్లో సిల్టులు తొలగించాలని అసిస్టెంట్ కమిషనర్ వారిని ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, టిడ్కో హౌసింగ్ ఇన్‌ఛార్జి పిడి పిచ్చయ్య, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవలు ఎనలేనివి : ఎంఎల్ఎ

నరసాపురం: రోటరీ క్లబ్ సేవలు ఎనలేనివని నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. శుక్రవారం చినమామిడిపల్లి వంతెన పాలకొల్లు రోడ్డులో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వాగతం శుభ వందనం విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, బిజెపి మండల కన్వీనర్ మేకల సతీష్ హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ తాను ఎంఎల్ఎ అయిన తరువాత మొదట సుస్వాగతంతో కార్యక్రమం మొదలెట్టడం సంతోషకరంగా ఉందన్నారు. నరసాపురం ముఖద్వారంలో నరసాపురానికి విచ్చేసిన వారికి సుస్వాగతం తెలిపే విగ్రహాన్ని పెట్టించిన నరసాపురం రోటరీ క్లబ్ సభ్యులను అభినందించారు. ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్ మాట్లాడుతూ రోటరీ ఎవరికి ఏ సహాయం కావాలని వచ్చినా ముందుండి అన్ని విధాలా సహాయం చేస్తున్నారని క్లబ్ నరసాపురాన్ని రోటరీ ప్రెసిడెంట్ గన్నబత్తుల సత్యవతిని ప్రశంసించారు. బిజెపి కన్వీనర్ సతీష్ మాట్లాడారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు కోట్ల రామ్‌కుమార్, ఘంటసాల బ్రహ్మాజీ, రెడ్డప్ప ధవేజీ, రామకృష్ణ పాల్గొన్నారు.

250 మందికి వైద్య పరీక్షలు

పోడూరు: మండలంలోని పండిత విల్లూరులో న్యూలైఫ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఏలూరు ఆశ్రమం మల్టీస్పెషాల్టీ హాస్పిటల్ మెడికల్ కాలేజీ ద్వారా ఐపిసి చర్చిలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో 250 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసినట్లు న్యూలైఫ్ మినిస్ట్రీస్ డైరెక్టర్ ఐపిసి చర్చి పాస్టర్ రెవరెండ్ జి.సామ్యేల్ జాన్సన్ తెలిపారు. ఈ శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఆశ్రమం హాస్పిటల్ డాక్టర్స్ వైఎన్.సాయికష్ణ(జనరల్ మెడిసిన్), బి.అమత (ఆప్తాలమాలజిస్ట్), డి.వెంకట్ (పీడియట్రిక్స్), ఎ.భార్గవ్ (ఆర్థోపెడిక్). పావనిప్రియ (గైనకాలజిస్ట్) సంబంధిత శాఖల నర్సింగ్ సిబ్బంది 250 మందిని పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మెరుగైన వైద్య సహాయం కావాల్సిన వారికి ఆశ్రమం ఆసుపత్రికి వెళ్లేందుకు వీలుగా శనివారం ఉచిత బస్సు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పిఆర్‌ఒ సురేష్, ఐపిసి పాస్టర్ జి.శామ్యూల్ మోర్స్, పాస్టర్ సదమళ్ల మేరీ శాంతి, గుత్తుల సాల్మన్ దొర పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యం అందించాలి

ఆసుపత్రిని తనిఖీ చేసిన ఎంఎల్ఎ రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు

ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించేలా వైద్యులు కృషి చేయాలని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ సూచించారు. శుక్రవారం స్థానిక జిల్లా ఆసుపత్రిని ఆరిమిల్లి రాధాకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆసుపత్రిలోని అవుట్ పేషెంట్ విభాగం, అత్యవసర విభాగం, వెటర్నిటీ వార్డు, ఆపరేషన్ థియేటర్, పోస్టునేటల్ వార్డు, నవజాత శిశువు సంరక్షణ (ఎస్ఎన్‌సియు), డయాలసిస్ విభాగాలను పరిశీలించి ఆసుపత్రి సూపరింటెండెంట్ వెలగల అరుణ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలు విభాగాల్లో చికిత్స పొందుతున్న రోగులను ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి ప్రాముఖ్యతిస్తోందన్నారు. గతంలో టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉండగా 2019లో చంద్రబాబునాయుడు ఈ ఆసుపత్రిని ఏరియా ఆసుపత్రి నుంచి జిల్లా ఆసుపత్రి స్థాయికి అభివృద్ధి చేశారని తెలిపారు. వైసిపి హయాంలో నిర్లక్ష్యం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో ఈ ఆసుపత్రిని జిల్లాస్థాయికి అనుగుణంగా అన్ని విధాలా అభివృద్ధి చేసి తణుకు, తణుకు పరిసర ప్రాంతాల ప్రజలకే కాకుండా జిల్లా ప్రజలందరికీ అన్ని సౌకర్యాలూ అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరికైనా గుండెపోటు వస్తే మొదటిగా లైఫ్‌సేవింగ్(గోల్డెన్ అవర్) గంటలో ప్రాణాలను కాపాడే అన్ని సౌకర్యాలూ ఉన్నాయన్నారు. వారు ఆసుపత్రికి వస్తే ఇసిజి చేసి, దానికి సంబంధించిన ఇంజెక్షన్ చేస్తే వారి ప్రాణాలు కాపాడబడతాయన్నారు. కేన్సర్ బారిన పడినటువంటి వారు కీమోథెరపీ చేయించుకునే సౌకర్యం ఇక్కడ ఉందన్నారు. మొదటి రెండు కీమోథెరపీలు ఎక్కడైతే వారు వైద్యం చేయించుకుంటున్నారో అక్కడ చేయించుకున్న తరువాత ఫాలోఅప్ కీమోథెరపీలన్నీ ఉచితంగా ఈ ఆసుపత్రిలో చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు గమనించి సౌకర్యాలను వినియోగించుకోవాలన్నారు. సేవలన్నీ సక్రమంగా అందేలా చూసి రాష్ట్రంలోనే బెస్ట్ ఆసుపత్రిగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, వైద్యులు సాయిబాలాజీ పాల్గొన్నారు.

ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న ఎంఎల్ఎ

పింఛన్ల పంపిణీ పండుగలా జరగాలి : పితాని

ప్రజాశక్తి - పెనుమంట్ర

వృద్ధులకు, వికలాంగులకు పెద్ద కొడుకుగా ఉంటానని, రూ.4 వేల పింఛను మొత్తాన్ని పెంచడమే గాక, గడిచిన మూడు నెలలకు పెరిగిన మూడు వేల రూపాయలు కలిపి మొత్తం రూ.7 వేలను జులైలో పంపిణీ చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేస్తున్నారని ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో ఆయన ఎంపిడిఒలతో సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. పింఛన్ల పంపిణీ ప్రతిచోటా ఒక పండుగలా జరిపించాలని, దానికోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. ఈ మేరకు ఈ నెల 30వ తేదీన ఆదివారం మార్టేరులో అన్ని సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. ఒకటో తేదీ ఉదయం 6 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పింఛన్లను వృద్ధులకు రూ.4,000, వికలాంగులకు రూ.6,000, పూర్తి వికలాంగులకు రూ.15,000తో పాటు మూడు నెలలకు మూడు వేల రూపాయలు పెంచి బట్వాడా చేయాలని అన్నారు. పెనుమంట్ర, ఆచంట, పోడూరు, పెనుగొండ మండలాల్లో ఎంపిక చేసిన 15 గ్రామ పంచాయతీల పరిధిలో పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో పెనుమంట్ర, ఆచంట, పోడూరు, పెనుగొండ ఎంపిడిఒలు పాల్గొన్నారు.

పిల్లల ఆహార విషయంలో శ్రద్ధ అవసరం

ప్రజాశక్తి - గణపవరం

తల్లిదండ్రులు పిల్లల ఆహార విషయంలో శ్రద్ధ తీసుకోవాలని గణపవరం పిహెచ్‌సి డాక్టర్ పి.సంతోష్ నాయుడు అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే సందర్భంగా ఆసుపత్రి పరిధిలోని అన్ని సచివాలయాల వద్ద ఫ్రైడే డ్రైడేతో పాటు డయేరియాపై అవగాహన కల్పించారు. ఈ సంద ర్భంగా సంతోష్‌నాయుడు మాట్లాడుతూ సచివాలయం వద్ద ఫ్యామిలీ ఫిజీషియన్‌తోపాటు డయేరియాపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఐదేళ్లలోపు పిల్లలకు ఆహార విషయాల్లో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతపై దృష్టిపెట్టి కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ కమ్యూనిటీ అధికారి జాలాది విల్సన్‌బాబు, మిడ్ లేబుల్ హెల్త్ ప్రొవైడర్ నున్న పాప, ఎఎన్ఎం ప్రేమలీల, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. కాశిపాడులో ఫ్రైడే డ్రైడేతోపాటు మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా పిప్పర వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా పిప్పర పిహెచ్‌సి డాక్టర్లు ప్రియాంక సంతోష్ కుమార్ రెడ్డి మాట్లాడారు. ఇంటి పరిసరాల్లో పనికిరాని వస్తువులను దూరంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ ఇఒ వెంకటేశ్వర్లు, ఆరోగ్య సహాయకులు నామాల రాజు, పిప్పర సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ టిహెచ్ దుర్గాభవాని పాల్గొన్నారు.మొయ్యేరులో పిప్పర పిహెచ్‌సి ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిహెచ్ఇఒ ఇఒ ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఎస్ టివి.సుబ్బలక్ష్మి, డి.రేవతికుమారి, బి.కుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గణపవరం విద్యాశాఖను పశ్చిమలో కలపాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - గణపవరం

ప్రభుత్వం చేపట్టిన విధానాల వల్ల గణపవరం విద్యాశాఖ గందరగోళంలో పడిందని యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి జి.భవానీప్రసాద్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఏలూరు జిల్లాలో ఉన్న గణపవరం మండలాన్ని 2023 ఫిబ్రవరి 16న అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పశ్చిమగోదావరి జిల్లాలో విలీనం చేశారని తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాలో విలీనం చేసిన విద్యాశాఖను మాత్రం మార్చకపోవడంతో మండల విద్యాశాఖ అధికారులు గందరగోళంలో పడ్డారని తెలిపారు. దీంతో మండల ఉపాధ్యాయులు ఏలూరు శిక్షణ తరగతులకు వెళ్లాలన్నా, వ్యక్తిగత పనుల నిమిత్తం డిఇఒ కార్యాలయానికి వెళ్లాలంటే గణపవరం నుండి 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఏలూరు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. విద్యాశాఖను పశ్చిమగోదావరి జిల్లాలో కలిపితే సమావేశాలకు భీమవరం వెళ్లడానికి దగ్గరగా ఉంటుందని చెప్పారు. ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించే సబ్ ట్రెజరీ ఏలూరు జిల్లా భీమడోలులో ఉండడం వల్ల జీతాలకు బిల్లులు సబ్మిట్ చేయడానికి దూరాభారం అవుతోందని పేర్కొన్నారు. దీనివల్ల జీతాలు ఆలస్యంగా అందుతున్నాయని తెలిపారు. డిఇఒ కార్యాలయం నుంచి సమాచారం వస్తే ఏలూరు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. వివిధ పనులపై డిఇఒ కార్యాలయానికి ఏలూరు వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదని తెలిపారు. జిల్లా అధికారులు గణపవరం మండల విద్యాశాఖను పశ్చిమగోదావరి జిల్లాలో విలీనం చేసి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా విద్యాశాఖ అధికారులను పలుమార్లు యుటిఎఫ్ విజ్ఞప్తి చేసినప్పటికీ విలీనం చేయలేదని అన్నారు. జిల్లా అధికారుల వెంటనే ఈ విషయంపై చర్యలు తీసుకొని గణపవరం మండల విద్యాశాఖను పశ్చిమగోదావరి జిల్లాలో కలపాలని కోరారు.

సిపిఎఫ్ యాజమాన్యం మొండి వైఖరి వీడాలి

ఉద్యోగ, కార్మికులకు న్యాయం చేయాలి

సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజారామ్మోహన్‌రాయ్, జుత్తిగ గోపాలన్

ప్రజాశక్తి - గణపవరం

సరిపల్లిలోని సిపిఎఫ్ ఫ్యాక్టరీని వెంటనే తెరిపించాలని కోరుతూ ఆ ఫ్యాక్టరీ ఉద్యోగ, కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో ఏలూరు లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జుత్తిగ గోపాలన్, కె.రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ సిపిఎఫ్ ఉద్యోగ, కార్మికుల సమస్యపై ఏలూరులో డిసిఎల్ కార్యాలయంలో ఫ్యాక్టరీ యజమానులకు, ఉద్యోగులకు జాయింట్ సమావేశం ఏర్పాటు చేశారని, ఈ సమావేశానికి ఫ్యాక్టరీ ప్రతినిధులు గైర్హాజరయ్యారని అన్నారు ఉద్యోగ కార్మికులకు న్యాయం చేయకుండా యాజమాన్యం మొండి వైఖరితో ఉన్నట్టు కన్పిస్తోందన్నారు. 22 రోజులుగా కార్మిక, ఉద్యోగులు నిరసన తెలుపుతున్నా యాజమాన్యం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. యాజమాన్యం చర్చలకు రాకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు ఉద్యోగ కార్మికులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని వారు కోరారు. కార్యక్రమంలో నేతలు యాసారాపు రామకృష్ణ, నంద్యాల శివరామరాజు, గన్నాబత్తుల కోటేశ్వరరావు, కవల నాగేశ్వరావు, మేకా రమేష్, జాలెం నరేంద్ర, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న కార్మికులు, ఉద్యోగులు

దస్తావేజులు పోయినవి

ప.గో.జిల్లా పాలకొల్లు పట్టణంకు చెందిన గుణ్ణం అమ్మామణి తెలియజేయునది ఏమనగా ది 15-6-2024న మా ఇంటి ఒరిజినల్ దస్తావేజులు డూప్లికేట్ తీయించుటకు మా ఇంటి నుంచి పాలకొల్లు మెయిన్ సెంటర్ కు వెళుతుండగా దారిలో పడిపోయినవి. ఎంత వెతికినా దారిలో దొరకలేదు.నా ఒరిజినల్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెంబర్ 4859/1985.. ఎవరికైనా దొరికిన నాకు అందజేయగలరు.

గుణ్ణం అమ్మామణి, W/o.వెంకటేశ్వరరావు, డోర్ నెంబర్ 28-2-8/2 , సుబ్బారాయుడు గుడి దగ్గర, పాలకొల్లు. సెల్ : 9396623339

పాస్‌పోర్టు పోయినది

ప.గో.జిల్లా, పాలకొల్లు పట్టణం డోర్ నెం.26-3-1/1A నివాసి యర్రంశెట్టి అనూషా, W/o.సుభాష్ తెలుపునది ఏమనగా నేను **ది.03-05-2024వ** తేదీన మా అబ్బాయి (10 సంగలు) ఒరిజినల్ పాస్‌పోర్టు జిరాక్స్ తీయు నిమిత్తం మా ఇంటి నుంచి మెయిన్ రోడ్‌కు మోటార్ సైకిల్‌పై వెళుతుండగా మా అబ్బాయి రతన్‌జీ పాస్‌పోర్టు దారిలో పడిపోయినది. రతన్‌జీ పాస్ పోర్టును **ది.13-06-2019వ తేదీన T2649027** గా వైజాగ్‌లో పొందియున్నాడు. నేను ఎంత వెతికినా పాస్‌పోర్టు దొరకలేదు. కాబట్టి ఎవరికైనా దొరికిన నాకు అందజేయవలసినదిగా కోరి ప్రార్ధించుచున్నాను. **సెల్.7396337393**

పాస్‌పోర్టు పోయినది

పగోజిల్లా, పెనుగొండ మండలం సోమరాజుచెరువు గ్రామానికి చెందిన నున్నబోయిన దుర్గారావు, తండ్రి: సూర్యనారాయణ అను నేను నా యొక్క పాస్‌పోర్టు పోయినది. సోమరాజు చెరువు నుండి పెనుగొండ వస్తుండగా నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది. పాస్‌పోర్టు నెం. **X5990035** గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

అడ్రస్: నున్నబోయిన దుర్గారావు
తండ్రి: సూర్యనారాయణ
హౌస్ నెం. 3-16, సోమరాజుచెరువు గ్రామం
పెనుగొండ మండలం, పగోజిల్లా
పిన్: 534324, సెల్: 9652515582

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, నరసాపురం మండలం, వేములదీవి తూర్పు గ్రామ కాపురస్తురాలు పొన్నమండ మేరీ, W/o. శ్రీను అను నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. వేములదీవి నుండి నరసాపురం జిరాక్స్ నిమిత్తం ఆటోలో వెళుతుండగా మార్గ మధ్యలో పడిపోయినది. నా యొక్క పాస్‌పోర్టు నెంబర్ **P9552230.** ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రసల్‌కు తెలియజేయగలరు.

అడ్రస్: పొన్నమండ మేరీ
W/o. శ్రీను, వేములదీవి తూర్పు
నరసాపురం మండలం, పగోజిల్లా
సెల్: 9347393961

చంద్రయ్య మృతి తీరని లోటు

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

చంద్రయ్య భౌతికదేహానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ఇంజేటి చంద్రయ్య మృతి పేదలకు, దళితులకు తీరనిలోటు అని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. గురువారం మధ్యాహ్నం ఆకస్మికంగా మృతి చెందిన ఇంజేటి చంద్రయ్య భౌతిక దేహాన్ని శుక్రవారం సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ పేదలు, దళితుల పక్షాన నిలిచి ఏ సమస్య ఉన్నా పోరాడే వ్యక్తి ఇంజేటి చంద్రయ్య అని కొనియాడారు. 12 ఏళ్ల క్రితం వెంప బస్టాండ్ పోరాటంలో అగ్రభాగాన ఉండి ఉద్యమించిన ధైర్యశాలి చంద్రయ్య అన్నారు. చంద్రయ్య తమ్ముడు ఇంజేటి శ్రీనివాసరావు సిపిఎం మండల కన్వీనర్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఆయన మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బత్తుల విజయ్ కుమార్, కె.క్రాంతిబాబు, చంద్రయ్య, సోదరులు సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాసరావు, ఇంజేటి త్రిమూర్తులు, ఇంజేటి రవికుమార్, కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైల్వే సమస్యలపై ఎంఎల్ఎ రఘురామకు వినతి

భీమవరంటౌన్: ప్రజా ప్రతినిధిగా ప్రజా సమస్యలను పరిష్కరించడం నైతిక బాధ్యత అని, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ రాష్ట్ర అభివృద్ధికి కంకణం కట్టుకున్నారని ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు అన్నారు. శుక్రవారం రైల్వే సమస్యలపై శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజుకు వినతిపత్రం అందజేశారు. జిల్లా నుంచి ఎంతో మంది ప్రయాణికులు నిత్యం రైల్వే వ్యవస్థపైనే ఆధారపడి ఉన్నారని, ప్రస్తుతం రైళ్ల రద్దుతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనిపై రైల్వే అధికారులకు ఫ్యాక్స్ ద్వారా వినతిపత్రం అందజేశామని, రైల్వే అధికారులతో మాట్లాడి ప్రత్యామ్నాయంచూపాలని కోరారు. స్పందించిన రఘురామకృష్ణంరాజు అధికారులతో మాట్లాడతానని తెలిపారు.

స్ఫూర్తి అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి - ఉండి

విద్యార్థి దశ నుంచే స్వశక్తితో ఎదగాలనే ఆలోచన ప్రతి ఒక్కరిలోనూ ఉండాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత, శాస్త్రవేత్త డాక్టర్ ఎంఆర్.రాజు అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే నిరుపేద విద్యార్థులకు శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.రామలక్ష్మి అధ్యక్షతన ఏర్పాటు చేసిన అవార్డు ప్రదానం కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ ఎంఆర్.రాజు మాట్లాడారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి నుంచి పదో తరగతి వరకూ చదివే నిరుపేద విద్యార్థులు పది మందిని ఎంపిక చేసి వారిని ప్రోత్సహించేందుకు నగదు బహుమతిని, ప్రశంసా పత్రాలు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాద్‌రాజు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొడుకుతో గొడవపడి..

పెనుమంట్ర: కొడుకుతో మీద కోపంతో చెరువులో దూకి తండ్రి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం. మండలంలోని మల్లిపూడి గ్రామానికి చెందిన గుడిమెట్ల భాస్కరరెడ్డి (75)కి కొడుకు మధ్య గొడవ జరిగింది. ఈ ఆ కోపంతో రెండు రోజుల కిందట నత్తారామేశ్వరంలో ఉంటున్న తన కుమార్తె ఇంటికి వచ్చి చూశాడు. అయితే అప్పటికే ఆమె తీర్థ యాత్రలకు వెళ్లడంతో తిరిగి సొంతింటికి వెళ్లలేక నత్తారామేశ్వరం - పాలి రోడ్డులో ఉన్న పంచాయతీ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహం చెరువులో తేలే వరకూ ఎవరికీ తెలియరాలేదు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు మృతదేహాన్ని చెరువులోంచి తీసి, పంచనామా చేశారు. కుమార్తె ఫిర్యాదు మేరకు పెనుగొండ సిఐ ఆధ్వర్యంలో పెనుమంట్ర పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రి కలిసిన నేతలు

పెనుమంట్ర: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంలో కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపినట్లు మండలంలోని టిడిపి నాయకులు జుత్తిగ సత్యనారాయణ తెలిపారు. కార్మిక మంత్రిగా ప్రమాణం చేసింది మొదలు ఆయన చాలా డైనమిక్‌గా పని చేస్తున్నారన్నారు.

మహారాజశ్రీ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, నర్సాపురం
ఓ.ఎస్. నెం. 126/2022

మధ్య:
పమ్మి (బయ్యే) రోజి -వాది
మరియు
కాటం ఝాన్సీ లక్ష్మీబాయి అండ్ అదర్స్ -ప్రతివాదులు

ప్రతివాది నెంబర్-4: గొల్లమందల హేమ, W/o. జగదీష్, హిందూ, వయస్సు 31 సంగలు, C/o. పమ్మి చిట్టి, రాపాకపేట, దిగమర్రు గ్రామం, పాలకొల్లు మండలం, పాలకొల్లు జూనియర్ సివిల్ కోర్టు వారు ఇలాకా, పశ్చిమగోదావరి జిల్లా.

ప్రతివాది నెంబర్-6: పమ్మి ప్రవీణ్‌కుమార్, S/o. లేటు వెంకట్రావు, హిందూ, వయస్సు 26 సంగలు, C/o. పమ్మి చిట్టి, రాపాకపేట, దిగమర్రు గ్రామం, పాలకొల్లు మండలం, పాలకొల్లు జూనియర్ సివిల్ కోర్టు వారు ఇలాకా, పశ్చిమగోదావరి జిల్లా.

దావా సమన్లు

పై నెంబరు దావా నందు శ్రీ కోర్టు వారు మీకు ఎన్నిసార్లు దావా సమనులు పంపించినను మీరు ఉద్దేశపూర్వకంగా తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున మీకు సమను అమలు నిమిత్తం శ్రీ కోర్టు వారు పేపర్ ప్రకటన ద్వారా **ది. 19-07-2024వ తేదీకి** మీ హాజరు నిమిత్తం పై కోర్టు నందు వాయిదా వేసినారు. కావున సదరు వాయిదాకు మీరు స్వయంగా గాని, వకీల్ ద్వారా గాని పై కోర్టులో పై తేదీన **ఉదయం 10 గంటల 30 నిమిషాలకు** హాజరై మీ యొక్క ఆక్షేపణలు కోర్టు వారికి తెలియపరచవలెను. లేని యెడల మీ పరోక్షమున దావా విచారించబడును.

అడబాల త్రినాధ ప్రభాకరరావు
అడ్వకేట్, డోర్ నెం.11-3/3
అగ్రహారం వీధి, కొత్తపేట గ్రామము
డాగ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా
28-6-24 సెల్: 9494429922

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, ఏలూరు
I.A. No. 428/223
FDIA No. 1945/2008
O.S. No. 7/1993

బిట్వీన్:
కొసరాజు వీర వెంకట వరప్రసాద్ -పిటీషనర్/వాది
మరియు
కొసరాజు వెంకట నారాయణ (died) వగయిరాలు -రెస్పాండెంట్లు

పిటీషనరు/వాది దాఖలు చేసిన పబ్లికేషన్

పై నంబరు గల పిటీషన్‌లో 9వ రెస్పాండెంటు మండలపు హరిత, D/o. లేటు పెద సుబ్బయ్య, ఫ్లాటు నెం. 20, శ్రేయ అపార్ట్‌మెంటు, కె.కె. టవర్స్, సత్రంపాడు, ఏలూరు, ఏలూరు జిల్లా వారికి **ది. 09-7-2024 తేది ఉదయం 10.30 నిగలకు** పై కోర్టులో స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి తమ ఆక్షేపణలు తెలియపర్చుకొనవచ్చును. లేని ఎడల సదరు పిటీషన్ ఏకపక్షముగా తీర్మానం చేయుదురని యిందుమూలముగా తెలియచేయడమైనది.

ఆవుల జగన్మోహనరావు
పుప్పాల రామకృష్ణ
అడ్వకేట్స్, శ్రీరామ నివాస్
ఏలూరు అశోక్‌నగర్, ఏలూరు
ది.28-6-2024 ఏలూరు జిల్లా

ఎంఎల్ఎను కలిసిన నేతలు

ఉండి: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎంఎల్ఎగా అఖండ విజయం సాధించిన కనుమూరి రఘురామకృష్ణంరాజును ఆయన నివాసంలో ఎంపిపి శ్రీహరి నారాయణరాజు, జెడ్‌పిటిసి రణస్థల కనకదుర్గ మహంకాళి మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని రఘురామకృష్ణంరాజును కోరినట్లు తెలిపారు. ఎంఎల్ఎను కలిసిన వారిలో వైస్ ఎంపిపి గుత్తుల కనకమహాలక్ష్మి కృష్ణ, ఎంపిటిసిలు మున్నలూరి సువర్ణలక్ష్మి శ్రీనివాస్, నిమ్మల కేశవ కుమార్ ఉన్నారు.

ప్రకటన
మహారాజశ్రీ 7వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, ఏలూరు
E.A. 8/2024, E.P. 5/2019
in O.S. 47/2018

బిట్వీన్:
మల్లిడి సునీల్‌రెడ్డి -డిక్రీ హోల్డర్
మరియు
కలిమెల కిషోర్‌బాబు -జడ్జిమెంటు డెటార్

పై నెంబరు E.P. లో కోర్టు వారు నిర్ణయించిన ప్రారంభ ధరను తగ్గించమని కోరుచూ పిటీషను దాఖలు చేసినారు. సదరు పిటీషను ది. 10-7-2024వ తేదీన 1వ రెస్పాండెంటు హాజరు నిమిత్తం వాయిదా వేసినారు. కావున 1వ రెస్పాండెంటు అయిన కలిమెల కిషోర్‌బాబు పై కోర్టు వారి ఎదుట **ది. 10-7-2024వ తేదీన ఉదయం 10.30 గంటలకు** హాజరు కావలెను. లేని ఎడల రెస్పాండెంటు పరోక్షంలో సదరు పిటీషను తీర్మానించబడును.

షెడ్యూలు: ఏలూరు జిల్లా, ఏలూరు టౌన్, పోస్టల్ కాలనీలోని గోవిందరాజపురం, హౌసింగ్ కాలనీ, శ్రీ శ్రీనివాసా కోఆపరేటివ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ లేఅవుట్ నెం. 33/73 లోని ప్లాట్ నెం. 130 in R.S. No. 119/2 లో 348-0-0 చగగల స్థలం, అందులో గల ఆర్.సి.సి. బిల్డింగుకు హద్దులు.
తూర్పు: ఫిషరీస్ డిపార్టుమెంటు వారి స్థలం. **దక్షిణం:** ప్లాటు నెం. 129. **ఉత్తరం:** రోడ్డు. **పడమర:** రోడ్డు.

బి.గౌరీశంకర్
శ్రీమతి ఎ.శోభారాణి
ఏలూరు **ఎ.వి.ఎస్.సూర్యారావు**
ది.28-6-24 అడ్వకేట్స్, ఏలూరు

In the Court of the IVth Addl. Junior Civil Judge, Eluru (Excise Court)
O.S. No. 182/2022

Between:
Devarapalli Satyanarayana ***...Plaintiff***
AND
Gudavalli Vijaya Lakshmi, W/o. late Gudavalli Satya Subrahmanyeswara Anand Kumar, Hindu, Male, aged 66 years, Properties D.No. 28-1-53/1, 8th Road, Santhi Nagar, Eluru, Eluru District. ***...Defendant***

కోర్టు ప్రకటన

పై నెంబరు గల దావాలో ప్రతివాదికి ఎన్నిసార్లు కోర్టు సమన్లు పంపిన పుచ్చుకోకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు సమన్లు అమలు నిమిత్తం పేపరు పబ్లికేషన్‌కు ఆర్డర్ వేసినారు. కావున పై వారికి ఏమయిన ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టు వారి ఎదుట **ది. 31-7-2024వ తేదీ ఉదయం 10.30 నిగలకు** హాజరు కావలెను. లేనిచో మీ పరోక్షమున తీర్పు చెప్పబడును.

NEKKARAGANTI NARASIMHA RAO
Eluru Advocate, Eluru
28-6-2024 Cell: 98481 18984

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ భీమవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S. No. 430/2023

వాది: మాన్యం నాగేశ్వరరావు
AND
ప్రతివాదులు:
మానేపల్లి వెంకట సుబ్రహ్మణ్యం వగైరా

ఒకటవ ప్రతివాది: మానేపల్లి వెంకట సుబ్రహ్మణ్యం, S/o. వెంకటేశ్వరరావు, డో.నెం. 5-95, రామాలయం వీధి, SRP అగ్రహారం, కలిదిండి, కలిదిండి మండలం, ఏలూరు జిల్లా.

రెండవ ప్రతివాది: మానేపల్లి సుబ్బలక్ష్మి, W/o. వెంకట సుబ్రహ్మణ్యం, డో.నెం. 5-95, రామాలయం వీధి, SRP అగ్రహారం, కలిదిండి, కలిదిండి మండలం, ఏలూరు జిల్లా.

పై నెంబరు దావా నందు మీ యొక్క హాజరు నిమిత్తము సమన్లు మీ అడ్రసుకు అనేక పర్యాయములు కోర్టు ద్వారాను, రిజిష్టర్ పోస్ట్ ద్వారాను పంపించినను వాటిని మీరు అందుకొని వుండుట లేదు. అందువలన మీరు **ది. 19-07-2024 సంగరం తేదీన ఉదయం 10 గంటల 30 నిమిషములకు** స్వయముగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరై పై కోర్టు వారి ఎదుట మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను. అట్లు హాజరు కానిచో మీ పరోక్షములో సదరు దావా తీర్మానించబడునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

కె.వి.రమేష్
భీమవరం వాది తరపు న్యాయవాది
28-06-2024 భీమవరం

బహిరంగ ప్రకటన
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో
ఓ ఎస్ నెంబర్ 224 ఆఫ్ 2023

బిట్వీన్
మేడిచర్ల వెంకట రామారావు ...వాది
మరియు
బండి అమ్మాజీ ...ప్రతివాది

తాడేపల్లిగూడెం కోర్టులో ప్రతివాది అయిన బండి అమ్మాజీ పై దావా దాఖలు చేసి రావలసిన సొమ్ము నిమిత్తం దాఖలు చేయగా బండి అమ్మాజీ గారు తణుకులో లేబర్ ఆఫీసు నందు ఉద్యోగం చేయుచు ఉండి ఎన్ని పర్యాయములు దావా సమనులు పంపించిన తీసుకొనకుండా తప్పించుకొనుచున్నందున దావా సమనులు అమలు నిమిత్తము ఈ పబ్లికేషన్ ద్వారా ప్రతివాదికి సమనులు అమలు చేయమని శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చినందున ఈ ప్రకటన రీత్యా దావాసమనులు అమలు నిమిత్తం ప్రకటన వేయడమైనది. ఈ దావా ది 29 ఆగస్టు 2024 కువాయిదా ఉన్నది. పై కోర్టులో పై తేదీన ఉదయం 10:30 లగాయితూ హాజరై మీయొక్క అభ్యంతరము తెలుపుకొనవలసి ఉన్నది. లేనియెడల దావా మీ పరోక్షమున తీర్మానము చేయబడును.

ముత్తా రామారావు,
అడ్వకేట్, సుబ్బారావు పేట,
తాడేపల్లిగూడెం తాడేపల్లిగూడెం.
తేది.27.6.2024 సెల్.9441171612